సాక్షి వైఎస్ఆర్ జిల్లా

గురువారం ; 8 ; మే ; 2025



ఐటీఐతో ఉపాధికి బాట

పదవ తరగతి పరీక్షలు పూర్తయి ఇటీవలే ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఇప్పుడు సంబంధిత విద్యార్థులంతా పది అనంతరం చేరవలసిన కోర్సులపై దృష్టిని కేంద్రీకరించారు. -10లో



బ్రహ్మంగారిమఠం.. భక్తజన సంద్రం

బ్రహ్మంగారిమఠం.. భక్తజన సంద్రంగా మారింది. శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. -10లో

గరిష్టం/కనిష్టం
38.4/24.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 24.4- 38.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కొత్త రేషన్ కార్డుల మంజూరుతోపాటు ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి అవకాశం కల్పించిందని జేసీ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కొత్త బియ్యం కార్డు, కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేరిక, బియ్యం కార్డులో పేర్లు తొలగింపు, కార్డును ప్రభుత్వానికి అప్పగించడం, కార్డులో చిరునామా మార్పు, కార్డులో తప్పుడు ఆధార్ కార్డు సీడింగ్ సరిచేసేందుకు అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సేవలు గతంలో ఆమోదించబడిన ప్రామాణికాల ప్రకారం అందించబడుతాయని జేసీ వివరించారు.

నేడు సుగవాసి అంత్యక్రియలు

రాయచోటి: రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయచోటిలో గురువారం ఉదయం 9 గంటల నుండి అంత్యక్రియల కార్యక్రమం నిర్వహించనున్నామని కలెక్టర్ బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్ల కోసం జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఇతర అధికారులకు సూచనలను చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

నందలూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించగా రూ.2,64,921 వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీ ఆదాయాన్ని నెలరోజుల తర్వాత లెక్కించామని.. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన, భక్తులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్మికులకు అవగాహన కల్పిస్తున్నఅధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్: అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వ అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రవితేజ తెలిపారు. బుధవారం కడప రైల్వేస్టేషన్, ఆటోస్టాండ్, రవీంద్రనగర్, పాత బస్టాండు, పండ్ల మార్కెట్‌లో అసంఘటితరంగ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి, యజమాని సమస్యలు, ఈ-శ్రమ్ కార్డులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ప్రవీణ్ కుమార్, పారా లీగల్ వలంటీర్ ఈశ్వరయ్య, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు.

రేపు హార్సిలీహిల్స్‌కు ఒబెరాయ్ చైర్మన్ రాక

బి.కొత్తకోట: రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, ఒబెరాయ్ హోటల్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అర్జున్ ఒబెరాయ్‌తో కలిసి మండలంలోని హార్సిలీహిల్స్‌పై శుక్రవారం పర్యటించనున్నారు. పర్యాటక రంగ అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ప్రఖ్యాత హోటల్స్ సంస్థ ఒబెరాయ్ సంస్థకు 20.93 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిలో సెవెన్ స్టార్ హోటళ్ల నిర్మాణం, విల్లాలను నిర్మించి అతిథిరంగాన్ని అభివృద్ధి చేయాలని గత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయించి ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. ఈ నిర్ణయంపై విల్లాలను నిర్మించి 250 మందికిపైగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఒబెరాయ్ ముందుకొచ్చింది. తర్వాత గత ఏడాది ఆగష్టులో కలెక్టర్ శ్రీధర్, సంస్థ ప్రతినిధులు కొండపై కేటాయించిన భూమిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడి వాతావరణం, పరిస్థితులు నచ్చడంతో నిర్మాణానికి తాము సిద్ధమే అన్న సంకేతాలను ఇచ్చారు. ప్రస్తుతం సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వస్తుండటంతో నిర్మాణ పనులకు బీజంపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరి పర్యటన కోసం రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్లాటు.. పాట్లు!



- రిజిస్ట్రేషన్‌శాఖలో స్లాట్ విధానం అమలు
- చిన్న పొరపాటు జరిగినా మరోమారు స్లాట్ తీసుకోక తప్పదు
- రెండోసారి రూ. 200లు, మూడోసారి రూ.500లు చెల్లించాల్సిన పరిస్థితి
- గత ప్రభుత్వ హయాంలో రోజుకు 150 పైగా రిజిస్ట్రేషన్లు
- ప్రస్తుతం రోజుకు 39 రిజిస్ట్రేషన్లకే అవకాశం



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం (ఇన్‌సెట్) ఆన్‌లైన్‌లో టైమ్ స్లాట్ బుక్ అయినట్లు చూపుతున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన టైమ్ స్లాట్ విధానం క్రయ విక్రయదారులకు చుక్కలు చూపిస్తోంది. స్లాట్ తీసుకున్నాక ఎన్నిపనులున్నా తంచన్‌గా వెళ్లాల్సిందే.. కొంచెం ఆలస్యమైనా.. చిన్న పొరపాటు జరిగినా మరోమారు స్లాట్ తీసుకోవాల్సిందే. అందుకోసం మరో రూ. 200లు సమర్పించుకోవాల్సిందే. ఇలా స్లాట్ విధానం.. భారంగా మారింది. గతంలో రోజులో ఎన్ని డాక్యుమెంట్లు అయినా రిజిస్ట్రేషన్ చేసేవారు. కూటమి ప్రభుత్వం నూతన విధానంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు శ్లాట్ ద్వారా 39 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఆర్వో కార్యాలయాల్లో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నందున 78 స్లాట్లను బుకింగ్ చేస్తున్నారు. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చికొంతమంది దూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ పనిమీద వచ్చిన వారు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో కడప, రాయచోటి ఆర్వో కార్యాలయాలు ఉన్నాయి. గతంలో కడప, రాజంపేట, రాయచోటి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రైల్వేకోడూరు తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు వందల సంఖ్యలో డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకొచ్చిన టైమ్ స్లాట్‌తో రిజిస్ట్రేషన్లు సగానికి తగ్గాయి. ప్రస్తుతం రోజులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఎస్ఆర్‌ఓలో కేవలం 39, ఆర్వో కార్యాలయాల్లో 78 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసేందుకు టైమ్ శ్లాట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి కొంత ఇబ్బందిగా మారింది. ఆరోజు రిజిస్ట్రేషన్ కాకపోతే మరుసటిరోజు ఇక్కడే ఉండి శ్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి వస్తోంది. ఒకవేళ ఆరోజుకూడా ఆన్‌లైన్ సైట్ పనిచేయకపోతే వేచి ఉండాల్సిన పరిస్థితులున్నాయి.

రెండోసారి స్లాట్ బుక్ చేసుకుంటే రూ. 200

రిజిస్ట్రేషన్ కోసం ఒకసారి టైమ్ స్లాట్ బుక్ చేసుకుంటే ఖచ్చితంగా అదే సమయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఓ పదినిమిషాలు ఆలస్యంగా వెళితే ఆ స్లాట్ ముగిసిపోతుంది. వారు మళ్లీ స్లాట్‌ను బుక్ చేసుకోవాలంటే అదనంగా రెండవసారి రూ.200, మూడవసారి రూ. 500 చెల్లించాల్సి వస్తుంది. ఫలితంగా క్రయ విక్రయదారులపై మరింత ఆర్థికభారం పడుతోంది.

గతంలో ఎప్పుడైనా అందుబాటులో టైమ్ స్లాట్

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో టైమ్ శ్లాట్ విధానాన్ని 2020 నుంచి వినియోగదారులకు అందుబాటులో ఉండేది. గత ప్రభుత్వ హయాంలో క్రయ విక్రయదారులే తమ డాక్యుమెంట్లను తయారు చేసుకుని వారికి అనువైన సమయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేలా పబ్లిక్ డేటా ఎంట్రీ విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతనంగా టైమ్ స్లాట్ విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చింది. గతంలో ఎప్పుడైనా టైమ్ శ్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని.. ప్రస్తుతం దానిని కుదించారు.

ఇబ్బందులు పడుతున్నాం

టైమ్ స్లాట్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయి. గతంలో స్లాట్ అన్ లిమిటెడ్‌గా బుక్ చేసేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం లిమిటెడ్ చేయడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చాలి. – కిశోర్‌కుమార్, కడప

జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి


కడప సెవెన్‌రోడ్స్: వేసవిలో జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా జిల్లాలో చేపడుతున్న వివిధ కాల పనుల పురోగతిపై జేసీ అదితి సింగ్‌తో కలిసి డ్వామా, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సీజన్‌లో జిల్లాలో ఎక్కడా నీటికొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జీవాలకు ఎలాంటి తాగునీటికొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టార్మ్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్ట భూములను సాగులోకి తీసుకురావాలని సూచించారు. ఎంపీడీఓలు, ఏపీఓలు వారు పనిచేసే మండలాల్లోనే నివాసం ఉంటూ ఉద్యోగ విధులను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. ఈ ఏడాది చివరి నాటికి 60 వేల ఎకరాల్లో ఉద్యాన మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఉద్యాన శాఖ అధికారులు, ఏపీఎంఐపీ, పీఆర్ అధికారుల సమన్వయంతో ప్లాంటేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరం ఉన్న ప్రాధాన్య పనులకు ఉపాధి కూలీలను సద్వినియోగం చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. డ్వామా పీడీ అదిశేషా రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసు లు రెడ్డి, ఉద్యాన శాఖ డీడీ సుభాషిణి, జెడ్పి సీఈఓ ఓబులమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ శారదమ్మ డ్వా మా ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన కల్పించాలి

కడప సెవెన్‌రోడ్స్: దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసే దిశగా జిల్లాలో ముందస్తుగా భద్రతపై మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పోలీసు, రెవెన్యూ, భద్రతా, అత్యవసర సేవా, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం సివిల్ మాక్ డ్రిల్ అంశంపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సంబందిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలో పౌర రక్షణ కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించా లని ఆదేశించారు. జిల్లాలోని జీజీహెచ్, ఏరియా, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో సమన్వయం చేసుకుని అన్ని రకాల అత్యవసర చికిత్సలు, మందులను, అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా పోలీసు శాఖ కార్యాలయం నుంచి ఎస్పీ అశోక్ కుమార్, కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జేసీ అదితిసింగ్, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు తదితరులు హాజరయ్యారు.

నేడు రైల్వేస్టేషన్‌లో మాక్ డ్రిల్..

దేశంలో పౌర రక్షణ – ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా.. చేపడుతున్న సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమాలపై జిల్లా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విసి ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్‌తో పాటు ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు హాజరయ్యారు. సీఎం వీసీ ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం ఉదయం 11 గంటలకు బాకరాపేట హెచ్పీసీఎల్‌లో, సాయంత్రం 4 గంటలకు కడప రైల్వేస్టేషన్‌లో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. మాక్ డ్రిల్ సమయంలోప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు చోటు లేకుండా అవగాహన పెంచాలన్నారు.



జయహో!

పహల్గాం ఉగ్రదాడి ఘటనకు ప్రతీకారంగా మంగళవారం అర్ధరాత్రి సాగిన 'ఆపరేషన్ సింధూర్'పై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేశారు. పలుచోట్ల టపాసులు కాల్చారు. జయహో.. భారత్ నినాదాలతో హోరెత్తించారు. ఉగ్రవాదులను పూర్తిగా అంతమొందించేదాకా విశ్రమించద్దని ప్రతి ఒక్కరూ నినదించారు. ఆర్మీ ధైర్యసాహసాలకు సెల్యూట్ చేశారు. – సాక్షి, నెట్‌వర్క్

ఇండియన్ ఆర్మీ సత్తాకు నిదర్శనం



'ఆపరేషన్ సింధూర్'తో ఇండియన్ ఆర్మీ సత్తా ప్రపంచ దేశాలకు తెలిసింది. జమ్ము-కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిజాన్ని దెబ్బ తీసేందుకు, భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు పాకిస్తాన్ ఉగ్రవాదులు అతి కిరాతకంగా పర్యాటకులను కాల్చి చంపడం దారుణం. ఉగ్రవాదులను ఏరిపారేయడానికి ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు ఇండియన్ ఆర్మీ 'ఆపరేషన్ సింధూర్' బుధవారం తెల్లవారుజామున 25 నిముషాల వ్యవధిలోనే 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఉగ్రమూకల పీచమణచడమే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ జరిపిన ఈ దాడిపై దేశం యావత్తు గర్విస్తోంది. ఉగ్రమూకల ఆటకట్టించడంలో ప్రధాని మోదీ తీసుకునే చర్యలకు ఇండియా అంతా ఒక్కటై మద్దతు తెలుపుతోంది. – వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప పార్లమెంటు సభ్యులు

భారత ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



ఉగ్రవాదాన్ని తుద ముట్టించడంలో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం,ఉగ్రవాద డెన్లన్నీ ఖల్లాస్ కావడం హర్షణీయం. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతి చర్యగా ఈ ఆపరేషన్ విజయవంతం చేసిన భారత సైన్యానికి సెల్యూట్ చేస్తున్నా. ఆపరేషన్ సింధూర్ సక్సెస్ చేసిన భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. –ఇస్మాయిల్, దర్గా-ఏ-గఫారియా కన్వీనర్

ఉగ్రవాదులూ.. తస్మాత్ జాగ్రత్త



ఎల్లప్పుడు శాంతిని కోరుకునే మన దేశంలో అమాయకపు ప్రజ ల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులపై దీటుగా సమాధానం చెప్పిన భారత సైన్యానికి సెల్యూట్. పహల్గంలో ఉగ్రదాడి తర్వాత భారత సైన్యం చాకచక్యంగా వ్యవహరించి ఉగ్రస్థావరాలపై దాడులు చేసి ఉగ్రవాదులను హతమార్చడం హర్షణీయం.ఇప్పటికైనా పాకిస్తాన్ గుణపాఠం నేర్చుకోవాలి. కవ్వింపు చర్యలకు పాల్ప డితే భారతీయులు గుణపాఠం నేర్పించడానికి సిద్ధంగా ఉన్నారు. ఇరు దేశాల్లోని ప్రజలు కలిసి మెలిసి శాంతియుతంగా ఉండాలా లేదా అని నిర్ణయించు కోవాల్సింది పాకిస్తానే. – వివేకానంద రెడ్డి, 30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ మాజీ అధికారి

ఉగ్రవాదాన్ని పెకలిద్దాం



ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించాల్సిన అవసరం ఉంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత వైమానిక దళాల దాడి అభినందనీయం. ఆపరేషన్ సింధూర్‌కు మా పూర్తి మద్దతు తెలుపుతున్నాం. యుద్ధం చేసేందుకైనా సిద్ధం. –సయ్యద్ గౌస్‌పీర్, జిల్లా జనరల్ సెక్రటరీ, కాంగ్రెస్



బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ జెండా చేతబూని హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

జెడ్పీలో కారుణ్య నియామకాలు



కారుణ్య నియామకపత్రాన్ని అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందురెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన తొమ్మిది మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి బుధవారం కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. వెంకట సురేష్ యాదవ్, కేశవకుమార్, షైఫ్ నఫీజ్, ఎస్‌జీవీ లక్ష్మి, హరిప్రసాద్, లావణ్య, సింధు, అరవింద వరప్రసాద్, నవీన్‌కుమార్‌లను ఆఫీసు సబార్డినేట్లు నియామకపత్రాలు అందజేశారు. కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి శ్రీనివాసులురెడ్డి జెడ్పీ చైర్మన్, సీఈఓలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పరిపాలన అధికారి భాస్కర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జెడ్పీటీసీ బయపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన భారీ వృక్షాలు
- అరటి, మామిడి రైతు కుదేలు



ఓబులవారిపల్లె: చిన్నఓరంపాడు సమీపంలో నేలకొరిగిన అరటిచెట్లను చూపిస్తున్న రైతు

పెనగలూరు/ఓబులవారిపల్లె: పెనగలూరు మండలంలో బుధవారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. 200 సంవత్సరాల కాలం నాటి చింతచెట్టు కూకటి వేళ్లతో సహా నేలకొరిగి రోడ్డుపై అడ్డంగా పడింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. ఎన్ఆర్ పురం బస్సు రాజంపేటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అక్కడే నిలిచిపోయింది. అధికారులు చర్యలు తీసుకొని రాకపోకలు జరిగేందుకు రోడ్డుపై చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. స్టేట్ బ్యాంక్ ఎదురుగా ఉన్న 150 సంవత్సరాల కాలం నాటి చింతచెట్టు కూడా విరిగిపడింది. పెనగలూరు గ్రామానికి చెందిన జిలకర కృష్ణయ్యకు చెందిన రేకులు గాలికి ఎగిరి పడిపోయాయి. అలాగే సుబ్బరాయుడు మామిడి తోటలో దాదాపు నాలుగు టన్నుల మామిడి కాయలు రాలిపోవడంతోపాటు రెండు చెట్లు కిందపడ్డాయి. ఈ గాలి వానకు విద్యుత్ తీగలు తెగిపోవడంతో తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రామాలలో విద్యుత్ సరఫరా లేదు. అనంతరం విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు ఏఈ తెలిపారు.

- ఓబులవారిపల్లె మండలంలో మంగళవారం రాత్రి వీచిన గాలి, కురిసిన వానకు అరటి, బొప్పాయి, ఆకు తోటలు నేలకొరిగాయి. బోటుమీదపల్లి, కాకర్లవారిపల్లి, రాళ్లచెరువుపల్లి, వైకోట, చిన్నఓరంపాడు తదితర గ్రామాలలో కోతకు వచ్చిన పండ్లతోటలు నేలకొరిగాయి. 200 మంది రైతులకు సంబంధించిన 100 ఎకరాల అరటి, 50 ఎకరాల తమలపాకు, 30 ఎకరాలు బొప్పాటి పంటలు దెబ్బతిన్నాయి.

క్లుప్తంగా

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వల్లూరు మండలానికి చెందిన వెంకట సుబ్బన్న (30) వాటర్‌గండి వద్దగల పొలాలలో మేకల కాపరిగా పనిచేస్తూ అర్ధరాత్రి పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీపై ఎమ్మెల్సీ మాటలు అవాస్తవం



మాట్లాడుతున్న వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయిదత్త

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయిదత్త అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యూనివర్సిటీలో ప్రవేశ పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారన్నారు. యూనివర్సిటీ స్థాపించినప్పటి నుంచి అన్నీ శాస్త్రీయంగా జరిగినప్పటికీ ఎమ్మెల్సీ అసత్యాలు చెప్పడం విచారకరమన్నారు. 2023 వ సంవత్సరంలో ప్రొఫెసర్ ఆంజనేయ ప్రసాద్ వైస్ చాన్సలర్‌గా ఉన్నప్పుడే యూనివర్సిటీకి సీఓఏ నుంచి అనుమతులు వచ్చాయన్నారు. అంతకుముందు సంవత్సరంలోని ఆర్కిటెక్చర్ ప్రవేశాల పైన కూడా కమిటీ వేశారని, కమిటీ సభ్యులు కళాశాలను సందర్శించి రిపోర్టులు సమర్పించారన్నారు. వాస్తవానికి ఏ యూనివర్సిటీ అయినా ప్రారంభమైన తర్వాతే దానికి కావల్సిన అనుమతుల కోసం దరఖాస్తు చేస్తారన్నారు. చాలా లేఖలు రాసిన తర్వాతే కమిటీలు వచ్చి, పరిశీలనలు జరిగాయన్నారు. ఎమ్మెల్సీ వాస్తవాలను ధ్రువీకరించుకోకుండా గత ప్రభుత్వం మీద బురద జల్లి లాభం పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

చెట్లు నరికివేత

బి.కొత్తకోట : గుమ్మసముద్రం వద్ద పొలంలోని 12 కొబ్బరి చెట్లను నరికివేశారని బాధితులు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు.

ఐటీఐతో ఉపాధికి బాట

- టెక్నికల్ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు
- పారిశ్రామిక శిక్షణ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు ఈనెల 24 తుది గడువు
- వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2900 సీట్లు



కడపలోని గవర్నమెంట్ డీఎల్‌టీసీ ఐటీఐ

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి పరీక్షలు పూర్తయి ఇటీవలే ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఇప్పుడు సంబంధిత విద్యార్థులంతా పది అనంతరం చేరవలసిన కోర్సులపై దృష్టిని కేంద్రీకరించారు. దీంతోపాటు కొంతమంది విద్యార్థులు పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు రాశారు. ఇక ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో పలువురు విద్యార్థులు వారి ఆసక్తిని బట్టి ఏ కోర్సులో చేరాలా అని ఆలోచనలో ఉన్నారు. అయితే అధికశాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరనున్నారు. ఇంకా కొందరు విద్యార్థులు టెక్నికల్ కోర్సులైన పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులలో చేరేందుకు ఆసక్తిని కనబరుస్తారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులతో ఒక చక్కటి బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

18 ఏళ్లు దాటగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు..

ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కటి మార్గంగా ఉంటుంది. విద్యుత్తు, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. అయితే ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్ తప్పని సరిగా ఉండాలి.

ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాందించిన విద్యార్థులకు ఉపాధి తప్పని సరిగా లభిస్తుంది. ఇదిలా ఉంటే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ, ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ కూడా ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ కోర్సు ఎంతో దోహదం చేస్తుంది.

జిల్లాలో 32 ఐటీఐలు..

జిల్లాలో 10 ప్రభుత్వ, 22 ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కళాశాలలకు సంబంధించి కడపలో డీఎల్‌టీసీ, మైనార్టీ ఐటీఐ, బాలికల ఐటీఐలతోపాటు చక్రాయపేట, వేముల, లింగాల, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, మైలవరం, తొండూరులలో ఉన్నాయి. ఇందులో కడపలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో హాస్టల్ వసతి కూడా ఉంది. ఇందులో ఉచిత వసతిలోపాటు భోజన సౌకర్యం కూడా ఉంది. వీటిల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి పదవ తరగతి మార్కులతోపాటు మెరిట్, రూల్స్ నాఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది. మిగతా 22 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి.

కోర్సుల వివరాలు ఇలా..

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఏడాది, రెండు సంవత్సరాలకు సంబంధించిన పలు కోర్సులు ఉన్నాయి. ఇందులో రెండు సంవత్సరాలకు సంబంధించి ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, టర్నర్, మిషినిస్టు కోర్సులు ఉన్నాయి. అలాగే ఏడాదికి సంబంధించిన కోర్సుల్లో డ్రెస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సు, డిజల్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్ కోర్సులు ఉన్నాయి. ఇందులో ఏడాదికి సంబంధించిన డ్రెస్ మేకింగ్ కోర్సు కడప ప్రభుత్వ బాలికల ఐటీఐలో మాత్రమే ఉంది. ఇందులో చేరిన బాలికలకు భోజనంతోపాటు ఉచిత వసతి సౌకర్యం ఉంది.

ఉన్నత చదువులకు అవకాశం..

ఐటీఐలో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందవచ్చు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు బీటెక్‌లో ప్రవేశం పొందవచ్చు. ఈ విధంగా ఏటా పలువురు లేటరల్ ఎంట్రీని పొంది ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి..



ఐటీఐలో చేరదలచే విద్యార్థులు ఈ నెల 24వ తేదీ వరకు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలి. కౌన్సిలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు పంపిస్తాం. పదవ తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్లు ఉంటాయి.

– ఎం. జ్ఞానకుమార్, ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల జిల్లా కన్వీనర్

స్వాతంత్య్ర పోరాటంలో 'అల్లూరి' పాత్ర కీలకం

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతదేశ స్వాతంత్య్ర ఉద్యమంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోషించిన పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం పోలీస్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి, బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా మన్యం ప్రజలతో కలిసి పోరాడారన్నారు. గెరిల్లా యుద్ధ తంత్రకళను ఉపయోగించి బ్రిటీష్ సైన్యానికి ముచ్చెమటలు పట్టించారన్నారు. ఈ కారణంగానే స్థానికులు ఆయనను 'మన్యం వీరుడు' అని పిలుచుకునేవారన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో అల్లూరి సీతారామరాజుది ప్రత్యేక అధ్యాయమని, నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడని జిల్లా ఎస్పీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, టైటస్, వీరేష్, శ్రీశైలరెడ్డి, శివరాముడు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఎస్ఐలు పోలీస్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

వీర గురుడు సేవలు అజరామరం

ఏపీ అదనపు మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్. చెల్లప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ అదనపు మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.చెల్లప్ప

కడప ఎడ్యుకేషన్ : సమాజంలోని పేదలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని ధారబోసిన టి. వీర గురుడి సేవలు అజరామరమని ఆంధ్రప్రదేశ్ అదనపు మాజీ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి ఎస్. చెల్లప్ప అన్నారు. బుధవారం కడప ప్రకాస్ నగర్‌లోని జన చైతన్య కార్యాలయం ఆవరణంలో వీరగురుడు ఫౌండేషన్ నిర్వాహకులు తిప్పన బ్రహ్మయ్య ఆధ్వర్యంలో వీర గురుడు విగ్రహ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వీర గురుడు ఒక ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ జన చైతన్య సమగ్రాభివృద్ధి సంఘం ఏర్పాటు చేసి సమాజంలోని పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో శ్రమించిన మహానుభావుడన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని అభ్యుదయ భావాలు ఉన్న వ్యక్తులందరూ సమాజ ఉన్నతికి బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ సేవలు సమాజానికి మరింత విస్తృతంగా అందాలన్నారు. టీడీపీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి మాట్లాడుతూ వీర గురుడు సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. న్యాయవాది సంపత్ కుమార్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.సురేష్ బాబు, వీరగురుడు ఫౌండేషన్ నిర్వాహకుడు తిప్పన బ్రహ్మయ్య తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటర్‌లో 950 మార్కులు సాధించిన విద్యార్థులకు జన చైతన్య సంఘం, వీర గురుడు ఫౌండేషన్ తరపున నగదు బహుమతులు, ప్రతిభా పురస్కారాలను అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు బాలనాయుడు, రమణారెడ్డి, ఎస్ఎండీ ఇలియాస్ బాషా, ఆంజనేయులు, హనుమంతు, సురేంద్ర, శివారెడ్డి, జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించడం హర్షణీయం



విద్యార్థిని శ్రీబిందులతను అభినందిస్తున్న కమిషనర్ లావణ్య

పులివెందుల రూరల్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో పులివెందులకు చెందిన ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన హాస్టల్ వార్డెన్ నాగేశ్వరమ్మ కృషి అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలా వీరాంజనేయ స్వామి, కమిషనర్ లావణ్యలు పేర్కొన్నారు. బుధవారం విజయవాడ అమరావతిలోని తుమ్మలపల్లె కళా క్షేత్రంలో పదవ తరగతిలో జిల్లాలోనే మంచి మార్కులు సాధించిన ఎస్సీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థిని ఎ.శ్రీబిందులతను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలా వీరాంజనేయ స్వామి, కమిషనర్ లావణ్యలు ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాన్ని, షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అనేక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతమ్మ, ఏఎస్‌డబ్ల్యూ రామాంజనేయులు హాస్టల్ వార్డెన్ నాగేశ్వరమ్మను అభినందించారు.

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు సన్నద్ధం



మాక్ డ్రిల్‌లో కడప ఎయిర్‌పోర్టులో గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉగ్రవాదుల దాడులు లేదా ఇతర విపత్కర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఐఓసీ బాట్లింగ్ ప్లాంట్, ఎయిర్ పోర్ట్‌లో బుధవారం సాయంత్రం పౌర రక్షణ మాక్ డ్రిల్ (సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్) నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాలతో తొలుత ఐఓసీ ప్లాంట్‌లో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సైరన్ మోగించి వెంటనే కార్మికులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సురక్షిత ప్రదేశంలోకి వెళ్లేలా సూచనలు చేసి వారిని చైతన్యపరిచారు. ఈ పరిస్థితులలో చేపట్టాల్సిన చర్యలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఐఓసీ ప్లాంట్ సెక్యూరిటీ ఆఫీసర్ వై.గోవర్ధన్ రెడ్డిలు వివరించారు. అగ్నిమాపక సిబ్బంది నీటి ద్వారా, అగ్నిమాపక నిరోధ యంత్రాల ద్వారా మంటలను ఆర్పేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, రిమ్స్ సీఐ సీతారామి రెడ్డి, అగ్నిమాపక అధికారి బసిరెడ్డి, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలరెడ్డి, శివరాముడు, టైటస్, కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొద్దార్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కమలాపురం సీఐ ఎస్కే రోషన్, పోలీస్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

- రెండు మోటార్ సైకిళ్లు ఢీ
- కింద పడిన విద్యార్థిపై ట్రాక్టర్ దూసుకెళ్లడంతో మృతి
- కన్నవారు, స్నేహితుల కన్నీరు మున్నీరు



గాయపడిన శశిధర్



వెంకటరమణ (ఫైల్)



వెంకటరమణ మృతదేహం వద్ద విలపిస్తున్న స్నేహితులు

కురబలకోట : రెండు మోటార్ సైకిళ్లు ప్రమాదవశాత్తు ఢీకొనగా ఓ విద్యార్థి రోడ్డుపై పడిపోవడం.. అప్పుడే అటుగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ అతని మీదుగా దూసుకెళ్లడంతో విద్యార్థి మృతి చెందిన విషాదకర దురదృష్టకర సంఘటన కురబలకోట మండలంలోని అంగళ్లులో బుధవారం మధ్యాహ్నం జరిగింది. మరో విద్యార్థి కూడా గాయపడ్డాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు..పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామం శెట్టివారిపల్లెకు చెందిన జి. వెంకట్రమణ (22) కదిరి రోడ్డులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీఏ చదువుతున్నాడు. అంగళ్లులో హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం మరో ఇద్దరు స్నేహితులతో కలసి అంగళ్లులో మోటార్ సైకిల్‌పై కళాశాల వద్దకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో మోటార్ సైకిల్ ఢీకొన్నట్లు చెబుతున్నారు. వెంకటరమణ ఒక వైపు, అతని స్నేహితులు ఇద్దరూ మరో వైపుగా పడిపోయారు. అప్పుడే రెప్పపాటులోనే అటుగా వేగంగా వచ్చిన ట్రాక్టర్ వెంకటరమణ మీదుగా దూసుకెళ్లింది. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మరో స్నేహితుడు నిమ్మనపల్లె మండలానికి చెందిన శశిధర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇంకొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన శశిధర్‌ను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి మృతితో తల్లిదండ్రుల కలలు కల్లలు కావడంతో వారి రోదన వర్ణణాతీతంగా మారింది. ఇంటి నుంచి సంతోషంగా కళాశాలకు వెళ్లిన వెంకటరమణ శవంగా మారడంతో బంధుమిత్రులు కూడా తల్లడిల్లిపోయారు. ఈ సంఘటన చూపరుల హృదయాలను కలచివేసింది. ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అలజడులు సృష్టించే మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు

రాయచోటి : విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసినా, పోస్ట్ చేసినా, ఆడియో, వీడియో మెసేజ్‌ల రూపంలో గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించిన వారిపై చట్టప్రకారం కఠినదండనలు తప్పవని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. గ్రూప్ అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యా యత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు నాగమ్మ

మదనపల్లె : ఒంటరితనాన్ని భరించలేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం, తరిగొండ పంచాయతీ, బురుజుపల్లికి చెందిన నాగమ్మ (90) ఒంటరి జీవితం గడుపుతోంది. కొద్దిరోజులుగా ఒంటరి జీవితం పై విరక్తితో బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో రెండు రోజులక్రితం మదనపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి బుధవారం తిరుగు ప్రయాణమై ఆటో ఎక్కింది. మార్గమధ్యంలోని తట్టివారిపల్లి చెరువు వద్ద దిగి, కొద్దిసేపు అటు ఇటు చూసి ఎవరూ రాని సమయంలో నీళ్లలోకి దూకేసింది. ఇంతలో గమనించిన స్థానికులు ఆమెను బయటికి తీసి బాధితురాలిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటోను ఢీ కొన్న స్కార్పియో

ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఆటోను స్కార్పియో ఢీ కొనడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రాజంపేట నుంచి కోడూరుకు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న స్కార్పియో వాహనం ఢీ కొంది. దీంతో స్కార్పియో, ఆటో డ్రైవర్లు సుబహాన్, అజయ్, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ పి. మహేష్ తెలిపారు.

బ్రహ్మంగారిమఠం.. భక్తజన సంద్రం



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి వారు

- వైభవంగా ఆరాధనోత్సవాలు
- శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు
- మార్మోగిన 'బ్రహ్మ'నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం.. భక్తజన సంద్రంగా మారింది. శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజోత్సవాలు నాలుగు రోజులుగా కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన రోజు కావడంతో.. ప్రధాన వేడుకలు నిర్వహించారు. ఈ రోజు స్వామి సజీవ సమాధిని దర్శించుకుంటే.. ఎంతో పుణ్యం లభిస్తుందని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. 'శరణమయ్యా.. బ్రహ్మయ్యా'.. 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని దీవించయ్యా..' అంటూ వారు వేడుకున్నారు. స్వామి సజీవ సమాధిని దర్శించుకుని తరించారు.

కమనీయంగా దీక్షాబంధనాలంకారోత్సవం

తెల్లవారుజామున శ్రీ వీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. స్వామి యోగ నిద్రలో ఉన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా నందివాహనోత్సవం

రాత్రి భక్తుల కాలక్షేపం కోసం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నందివాహన గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి స్వామి నివసించిన ఇంటి వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అక్కడ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కందిమల్లయ్యపల్లె పుర వీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం సంగీత కళాశాలకు చెందిన విద్యార్థులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబ దత్తాత్రేయస్వామి, గోవిందస్వామి, వరదరాజస్వామి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిబ్బంది, స్వామి శిష్యులు ఏర్పాట్లు చేపట్టారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో అర్బన్, రూరల్ సీఐలు రమణారెడ్డి, శివశంకర్ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

నేడు బ్రహ్మ రథోత్సవం

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో ఐదో రోజైన గురువారం సాయంత్రం బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నారు. స్వామి, అమ్మవారు రథంపై ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు.